బోరబండ ఠాణా ఎస్‌హెచ్‌ఓగా ఆదిరెడ్డి

ఎస్‌హెచ్‌ఓ బాధ్యతలు తీసుకున్న ఆదిరెడ్డి

ఎర్రగడ్డ: బోరబండ ఠాణా ఎస్‌హెచ్‌ఓగా ఆదిరెడ్డి ఎర్రగడ్డ, ఫిబ్రవరి 5: బోరబండ ఠాణా ఎస్‌హెచ్‌ఓగా కె.ఆదిరెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. హుమాయున్‌నగర్ పీఎస్‌లో విధులు నిర్వహించిన అతడు బదిలీపై బోరబండ ఠాణాకు వచ్చారు. ఇప్పటి వరకు బోరంబడ ఠాణా ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన విజయ్ తిరుమలగిరి పీఎస్‌కు బదిలీపై వెళ్లారు. కాగా బోరబండ ఠాణాలో నూతన ఎస్‌హెచ్‌ఓకు సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

రిజర్వేషన్ల పేరుతో మహిళలకు కేంద్రం మోసం

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి 5: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం మహిళలను మోసం చేస్తుందని భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి అన్నీరాజా ఆరోపించారు.సోమవారం హిమాయత్‌నగర్ లోని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ పాలనలో దేశంలో పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని,మహిళలు, యువతులపై వేధింపులు దాడులు పెరిగిపోయాయని విమర్శించారు.ఈ సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షురాలు పి.దుర్గా భవాని,రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి,నాయకురాలు పి.ప్రేంపావని, సదా లక్ష్మి, ఎస్.ఛాయదేవి, నళిని,జంగమ్మ,హైమావతి,మల్లేశ్వరి,గిరిజ,పద్మ,మంజుల పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను హరిస్తున్న కేంద్రం

కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను హరిస్తుందని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ అన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన ఏఐవైఎఫ్ రాష్ట్ర స్థాయి సమావేశంలో పై విధంగా మాట్లాడారు.

ఆస్తిపన్ను వసూలు వేగిరం

ఆస్తి పన్ను వసూలుకు ప్రత్యేక బృందాలు

యూసుఫ్‌గూడ సర్కిల్ టార్గెట్ రూ.33.73 కోట్లు : ఇప్పటి వరకు వసూలైంది రూ.19 కోట్లు

జూబ్లీహిల్స్,ఫిబ్రవరి 5: ఆస్తిపన్ను వసూలుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపులకు మార్చి 31తో గడువు ముగియనుండడంతో ఆస్తిపన్ను వసూలును వేగిరం చేశారు. ఆస్తిపన్ను వసూలుకు యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 9 డాకెట్స్‌కు 9 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో పాటు జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలు ఆస్తిపన్ను వసూలు చేపడుతున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఆయా బృందాలతో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ కమల్, ఇన్‌చార్జి ఏఎంసీ బాల్‌రాజ్ ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది రూ.33.73 కోట్ల వసూలే లక్ష్యంగా అధికారులు ముందుకెళ్తున్నారు. ఇప్పటి వరకు రూ.19 కోట్ల ఆస్తిపన్ను వసూలు అయినట్లు తెలిపారు.

యూసుఫ్‌గూడలో ప్రత్యేక బృందాలతో కలిసి ఆస్తిపన్ను వసూలు చేస్తున్న ఏఎంసీలు కమల్, బాల్‌రాజ్

సకాలంలో చెల్లించకుంటే చర్యలు

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించకుంటే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది ఆస్తిపన్ను చెల్లింపులకు మార్చి 31తో గడువు ముగియనుంది. అంతేకాకుండా అధికారులు పాత బకాయిలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. మొండి బకాయిదారుల ఆస్తులను సీజ్ చేస్తున్నారు. సోమవారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను బకాయిలను వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

జరిమానా లేకుండా చూసుకోవాలి

ఆస్తిపన్నుపై అదనపు భారం పడకుండా వెంటనే చెల్లించాలి. ఈ ఏడాది ఆస్తిపన్నుకు మార్చి 31 వరకు గడువు ఉన్నందున ఈ లోపే చెల్లించాలి. ఆస్తిపన్ను చెల్లించకుండా మొండికేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. చట్ట ప్రకారం ఆయా ఇంటి యజమానులు, దుకాణాల ఆస్తులను సీజ్ చేస్తాము.

సేవా ఎస్లావత్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌గూడ

నాణ్యమైన విద్యను అందించాలి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, ఫిబ్రవరి 5: పాఠశాలలు లాభాపేక్షతో కాకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు దోహదపడాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు.రాజేంద్రనగర్ మండల పరిధిలోని పిల్లర్ నంబర్ 207 వద్ద లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులను పోటీ పరీక్షలకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ముస్తాక్ అలీఖాన్,పాఠశాల పౌండర్ అజ్మతుల్లా ఖాన్, డైరెక్టర్ అప్సనా షేక్,మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 : ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ ఆర్ఐ సారిక హెచ్చరించారు. శంషాబాద్ మండలంలోని అమ్మపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న ఖారీజ్‌ఖాత(ప్రభుత్వ భూమిని) సోమవారం కొందరు అక్రమార్కులు కబ్జా చేయడానికి కడీలు పాతి కబ్జా చేయడానికి యత్నిస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకొని వాటిని కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ సారిక మాట్లాడుతూ... శంషాబాద్ మండలంలోని అమ్మపల్లి రెవెన్యూ పరిధిలోని ఖారీజ్ ఖాతా భూమి పూర్తిగా ప్రభుత్వానికి చెందినది. ఈ భూమిలో ఎవరైనా కబ్జాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

అమ్మపల్లి రెవెన్యూ(ఖారీజ్‌ఖాతా)భూమిలో కడీలను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

షేక్‌పేట్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

వినోభానగర్‌లో నిర్మించనున్న మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

షేక్‌పేట్ ఫిబ్రవరి 5: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని హైద్రాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు,జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్‌పేట్ వినోభానగర్ కాలనీలో రూ.13 లక్షలతో నిర్మించనున్న పైపులైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

-ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను సన్మానిస్తున్న జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 47 కాలనీవాసులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 47 కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. సోమవారం కాలనీవాసులతో ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రత్యేకంగా సమావేశమై సమస్యలను గురించి ఆరా తీశారు. గత ఎన్నికల్లో కాలనీవాసులంతా బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలవడంతో గ్రేటర్ పరిధిలో అన్ని సీట్లలో పార్టీ విజయం సాధించిందని ఎమ్మెల్యే దానం అన్నారు. తమపై నమ్మకంతో ఓటేసిన వారికి అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించినందుకు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు దానం నాగేందర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి,సీహెచ్.కృష్ణమూర్తి, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ,నాగేశ్వర్‌రావు, మంజుల, ప్రసాదరాజు,శ్రీనివాసరావు, అనిల్‌రెడ్డి, అనిత, డా.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నో ఎంట్రీ నిబంధనలు అయినా.. డ్రైవర్లపై కేసు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 5: రద్దీ సమయాల్లో నో ఎంట్రీ నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్లపై తిరుగుతున్న రెండు హెవీ వెహికిల్స్ డ్రైవర్లమీద బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొంతకాలంగా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో నో ఎంట్రీ నిబంధనలు ఉల్లంఘిస్తూ హెవీ వెహికల్స్, మినీ టిప్పర్లు రోడ్లపై రాకపోకలు సాగిస్తుండడంతో పాటు ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. రెండు హెవీ వెహికల్స్ నిబంధనలు ఉల్లంఘించడంతో పాటు డ్రైవర్లు వెంకటరాములు,కృష్ణయ్యల మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి5: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నామని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి తెలిపారు.సోమవారం విఠల్‌వాడిలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించనున్న మంచినీటి పైపులైన్, సీసీ రోడు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీలు,కాలనీలో నివాసం ఉండే ప్రజల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో నారాయణగూడ జలమండలి మేనేజర్ మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జి.రామన్ గౌడ్, సుజాత,అనీష్ గంగపుత్ర,అభిషేక్ బస్తీ వాసులు పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛన్లు పంపిణీ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 5 : వాసవి సేవా కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి నెల పేద వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్నారు. సోమవారం ఖైరతాబాద్‌లోని సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.1200ల చొప్పున 500 మంది పేద వృద్ధులకు అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌తో కలిసి అందజేశారు.



పింఛన్లు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

ఘనంగా శ్రీత్యాగరాజ 177 వ ఆరాధనోత్సవం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 5: శ్రీత్యాగరాజ 177 వ ఆరాధనోత్సవం.. 47 వ వార్షిక సంగీత ఉత్సవం వారం రోజులుగా నగరంలోని ఖైరతాబాద్ విజ్ఞాన సమితి ఆనంద్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా శాస్త్రీయ సంగీత విద్వాంసుడు పి.పూర్ణచందర్‌ను సత్కరించి 'సంగీత విజ్ఞాన విశారద' బిరుదును ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా మల్లాది బ్రదర్స్‌గా ప్రసిద్ధి పొందిన రామ్ ప్రసాద్, డాక్టర్ మల్లాది రవి కుమార్ స్వర యుగళగీతం.. త్యాగరాజ కృతుల ప్రదర్శనలను వయోలిన్‌పై ఆర్.దినకర్, మృదంగంపై డాక్టర్ డీఎస్ఆర్ మూర్తి, కంజీరపై కె.శ్యామ్ కుమార్‌ల సహకారంతో సంగీత కచేరి అందించారు. ఈ వేడుకలలో కృతి విట్టల్ గాత్ర కచేరికి వయోలిన్‌పై డాక్టర్ కొంమండూరి కృష్ణ, మృదంగంపై పారుపల్లి ఫాల్గుణ్, ఘటంపై ఎస్.హనుమంతరావుల సహకారం అందించారు. కమలా దీప్తి సంగీత కచేరి, సుధారాణి గాత్రకచేరి, అశ్వత్ నారాయణ్ గాత్రకచేరి, సీఎస్ అనురూప్..బాల మేధావి గంగా శశిధరన్, చివరి రోజు సర్వేపల్లి సిస్టర్స్ గాత్ర యుగళగీతం అందించారు. వేడుకలలో చివరి అంకంగా 'గీతా సారం..త్యాగరాజ కీర్తనం..' లను డాక్టర్ శేషులత విశ్వనాథ్, డాక్టర్ నీతా చంద్రశేఖర్‌లు ప్రదర్శన అందించారు.

సంగీత ఉత్సవంలో పలువురు సంగీత నిపుణులు

షర్మిలపై అసత్యపు ప్రచారాలు మానుకోవాలి

వైఎస్ఆర్‌టీపీ నేత రాంరెడ్డి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 5 : ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై అసత్యపు ప్రచారాలను మానుకోవాలని వైఎస్ఆర్‌టీపీ నేత రాంరెడ్డి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో జగన్ అధికారంలోకి రావడానికి షర్మిల కష్టపడ్డారని గుర్తు చేశారు. నిజాయితీ ఉన్న నాయకురాలిగా ఆమెకు గుర్తింపు ఉందని, కాంగ్రెస్ అధ్యక్షురాలు కావడం ఇష్టం లేని కొందరు విమర్శలు చేస్తున్నారన్నారు. ఏపీలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావడమే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో వైఎస్ఆర్‌టీపీ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో సముచిత స్థానాలు పొందేందుకు కృషి చేస్తారన్నారు.

ఫోను చేసుకుంటా

ముగ్గురు నిందితుల అరెస్ట్

బంజారాహిల్స్,ఫిబ్రవరి 5: అర్జెంట్‌గా ఫోన్ కాల్ చేసుకోవాలంటూ దృష్టి మరల్చి సెల్‌ఫోన్ తస్కరించిన ఘటనలో ముగ్గురు నిందితులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలోకి వెళ్తే.. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన లాల్‌చంద్ హక్ మూసాపేటలో నివసిస్తుంటాడు. ఆదివారం రాత్రి బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు సమీపంలో బస్‌స్టాప్ వద్ద లాల్‌చంద్ వద్దకు ముగ్గురు వ్యక్తులు వచ్చి తమకు అర్జెంట్‌గా ఒక కాల్ చేయాల్సి ఉందంటూ వారిలో ఓ వ్యక్తి లాల్‌చంద్‌వద్ద నుంచి ఫోన్ తీసుకుని మాట్లాడుతుండగా మరో ఇద్దరు అతడితో మాటలు కలిపారు. కాసేపటికి వారు ముగ్గురూ అక్కడినుంచి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండడంతో అప్రమత్తమైన లాల్‌చంద్ హక్ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఉపేంద్ర అనే వ్యక్తిని పట్టుకున్నారు. వారిని పోలీసులకు అప్పగించగా అతడితో పాటు వచ్చిన వ్యక్తులు సూర్య, రాజు అని తేలింది. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు వారిపై ఐపీసీ 420, 379 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్ చేశారు.

ప్రజావాణికి ఫిర్యాదులు

బండ్లగూడ, ఫిబ్రవరి 5: రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఉప కమిషనర్ రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కార్యక్రమంలో ఐదు ఫిర్యాదులు అందినట్లు ఉప కమిషనర్ తెలిపారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

భద్రత..మన బాధ్యత

నగర ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్ విశ్వప్రసాద్

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి5: విద్యార్థి దశ నుంచే రోడ్డు నిబంధనలను తెలుసుకుంటే రోడ్డు ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని నగర ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్ పి.విశ్వప్రసాద్ విద్యార్థులకు సూచించారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా సోమవారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఆడిటోరియంలో రోడ్డు భద్రత-ట్రాఫిక్ నిబంధనలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై నడిచేవారు ఎదురుగా వచ్చే వాహనాలను చూసుకుంటూ నడవాలన్నారు. మద్యం తాగి వాహనం నడపడం,ట్రిబుల్ రైడింగ్, ఫోన్‌లో మాట్లాడటం,అతివేగం, సిగ్నల్స్ జంపింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రమాదాల నివారణ కోసం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల డ్రైవింగ్‌లో పూర్తి స్థాయిల్లో అవగాహన లేకపోవడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు.సమాజంలో జరిగే నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనంతరం నారాయణగూడ వైఎంసీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బేగంపేట ట్రాఫిక్ శిక్షణా సంస్థ ఏసీపీ జి.శంకర్‌రాజ్, నారాయణగూడ పీఎస్ సీఐ చంద్రశేఖర్,ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ,కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ నాగేశ్వరరావు,కోశాధికారి ఎల్.ప్రభాకర్‌రెడ్డి,ఎన్‌వైకెఎస్ డైరెక్టర్ ఎ.ఆర్.విజయ తదితరులు పాల్గొన్నారు.సాద్

నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్‌లో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న విశ్వప్రసాద్

ఒకేషనల్ విద్యావిధానంలో అవకతవకలను అరికట్టండి

ఖైరతాబాద్,ఫిబ్రవరి 5 : రాష్ట్రంలోని ఒకేషనల్ విద్యావిధానంలో జరుగుతన్న అవకతవకలను అరికట్టాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చాలా మంది పేద విద్యార్థులు చదవుకుంటున్నారని, అలాంటి వారికి ఒకేషనల్ విద్య ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాలన్న ఉద్దేశంతో వృత్తి విద్య కోర్సుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయన్నారు. శిక్షణ కోసం రాష్ట్రంలో సుమారు 492 పాఠశాలలను ఎంపిక చేశారన్నారు. శిక్షణ ఇచ్చే బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చేందుకు కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే సదరు ప్రాజెక్టును సంబంధించి శాఖ అధికారులు ప్రైవేట్ ఏజెన్సీలతో కుమ్మక్కై అనర్హత, బ్లాక్ లిస్టులో ఉన్న ఏజెన్సీలకు శిక్షణ ఇచ్చే బాధ్యతను అప్పగించారన్నారు. ఈ వ్యవహారంలో వందల కోట్ల రూపాయల దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది భాస్కర్

క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ

జూబ్లీహిల్స్,ఫిబ్రవరి 5: త్రోబాల్ క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.నవీన్ యాదవ్ పేర్కొన్నారు. ఈ నెల 8 నుంచి 11 వరకు ఢిల్లీలోని రోహిణి సెక్టార్‌లో జరుగనున్న 45వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు సోమవారం జెర్సీలు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ సిద్ధు, మేనేజర్ కిరణ్ చారి, పురుషుల జట్టు కెప్టెన్ శామ్యూల్, మహిళల జట్టు కెప్టెన్ శ్రీలేఖ, క్రీడాకారులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

బండ్లగూడ,ఫిబ్రవరి 5 : మున్సిపల్ శాఖలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు.ఈ మేరకు ఆయన రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్‌ను కలిసి సమ్మె నోటీసును అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ శాఖలో పని చేసే కాంట్రాక్ట్ ఉద్యోగులు చాలీచాలనీ వేతనాలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు.విధి నిర్వహణలో కార్మికులు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 25లక్షలు ఇచ్చేలా జీవో తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల కార్యదర్శి ఆనంద్, అధ్యక్షులు సాయిలు. సహాయ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్టు

జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంతో ఓ భారీ వృక్షం కూలడంతో పలు వాహనాలు దెబ్బతిన్నాయి. ఖైరతాబాద్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ పార్కులో ఏళ్ల నాటి ఓ వృక్షం ఉంది. ఈ చెట్టు నీడలో పలువురు వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. సోమవారం ఒక్కసారిగా ఆ వృక్షం నేలరాలింది. దీంతో రెండు కార్లు, 12 ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి. డీఆర్ఎఫ్‌కు సమాచారం అందించగా, వారు ఆ వృక్షాన్ని తొలగించారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ముందే తొలగించి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదని అంటున్నారు.

– ఖైరతాబాద్, ఫిబ్రవరి 5